జాతీయ దిన పత్రిక

తరంగాలు

## ఘనంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 27 తరంగాలు**

వలిగొండ మండల కేంద్రంలో ఆదివారం దొంత శ్యాంసుందర్ షాప్ వద్ద ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను పద్మశాలి సంఘం మరియు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేనేత రంగానికి, పద్మశాలి సమాజానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గంజి వెంకటేశ్వర్లు,చేనేత సహకార సంఘం అధ్యక్షులు దొంత శ్యాంసుందర్,పద్మశాలి సంఘం కోశాధికారి నామాల జగన్మోహన్, డైరెక్టర్ విఘ్నేష్,చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు జల్ల నరహరి,డైరెక్టర్ తవుటం రమేష్,గుంటి రవీందర్, మిరియాల శేఖర్, పద్మశాలి కుల పెద్దలు బడుగు సత్యనారాయణ,దొంత శంకరయ్య, ఐటిపాముల కుమార్, ఐటిపాముల ప్రభాకర్,గంజి ఉపేందర్, దొంత స్వామి, పాపని లక్ష్మయ్య,పాపని రాజు, కూరపాటి నవీన్, పారుపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం: బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 27 తరంగాలు**

యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీర్ల అయిలయ్య తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఉద్యమకారుల పోరాట స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ గారు తన జీవితాన్ని అంకితం చేశారని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఉద్యమకారులు తమ జీవితాలను, సమయాన్ని,శక్తిని ధారపోశారని, ఉద్యమకారుల త్యాగాలు,పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ప్రతి ఒక్క ఉద్యమకారుడి సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

## సాగరంలో బతుకమ్మ తల్లి విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



**జఫర్గడ్ ప్రతినిధి,సెప్టెంబర్27,(తరంగాలు ):**

మండలంలోని సాగరంలో బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భోగి పూజ చేశారు. కార్యక్రమానికి గ్రామానికి చెందిన పినింటి అనిత చంద్రశేఖర్ దంపతులు రూపాయలు 2.50 లక్షల రూపాయలు విరాళం అందించగా బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ తాటికాయల మమత చేతన్ కుమార్ హాజరై దాతలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు చంద్రశేఖర్ అనిత దంపతులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా తమ వంతు సహకారంగా తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుకు విరాళం ఇచ్చామన్నారు. సర్పంచ్ మమత చేతన్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుకు విరాళం అందించిన చంద్రశేఖర్ అనిత దంపతులకు గ్రామం తరపున అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుమన్ వరికెల మహేశ్వరరావు, కత్తుల కుమారస్వామి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పచ్చదనం పరిశుభ్రత





జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 227,(తరంగాలు): జఫర్ ఘడ్ గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ తా హి సేవ కార్యక్రమంలో భాగంగా పర్యాటక కేంద్రం అయినటువంటి ఖమ్మం దర్వాజ లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుల్లా మోహన్ రావు , ఎంపీఓ ప్రవీణ్ కుమార్ , పంచాయతీ కార్యదర్శి దినేష్ , వార్డు సభ్యులు యాకూబ్ పాషా, పాక్స్ వైస్ చైర్మన్ నర్సింగం , గ్రామ శాఖ సారంగం , మండల నాయకులు, గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తులో పాల్గొనడం జరిగినది.

## మండల కేంద్రంలోఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

- చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు
- రాష్ట్ర పద్మశాలి సంఘం అధికార ప్రతినిధి కందగట్ల నరహరి



**సంగెం సెప్టెంబర్ 27 తరంగాలు**

తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ111వ జయంతి వేడుకలు సంగెం మండలంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి పండ్లు పంపిణీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగెం సర్పంచ్ పేర్ల లలిత రమేష్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధికార ప్రతినిధి కందగట్ల నరహరి మాట్లాడుతూ..1915 సెప్టెంబర్ 27న కొమరం భీం జిల్లా వాంకిడిలో జన్మించిన బాపూజీ, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో, నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1952 నుండి 1971 వరకు ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్ గా, మంత్రిగా పనిచేసి, 1969లో ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రి బాపూజీ అని కొనియాడారు. బాపూజీ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల, ముఖ్యంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం పోరాడారని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ ఒడ్డున ఉన్న ఆయన నివాసం 'జలదృశ్యం' లోనే 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, అక్కడి నుండే మలిదశ ఉద్యమం మొదలైందని గుర్తు చేశారు. అనంతరం ఆయన చేసిన పోరాటాలను, తెలంగాణ కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలోసంగెం ఉప సర్పంచ్ ఆగపాటి రాజు, సంగెం పద్మశాలి సంఘం అధ్యక్షులు బిట్ల సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి మెట్టుపల్లి మల్లయ్య, మెట్టుపల్లి రమేష్, కోడూరి సదయ్య,అప్పల కవిత , వార్డు సభ్యులు వుండ్డిల మల్లికార్జున్, గొల్ల సందీప్ ,మెట్టుపల్లి కృష్ణ,, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఇప్పకాయల రమేష్ బాబు,ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల మనోహర్, కమిటీసభ్యులు బిట్ల రామకృష్ణ,కందకట్ల వెంకటేశ్వర్లు కందకట్ల సంపత్ ,ఇప్ప కాయల విజయ్ ప్రకాష్,,పేరాల లక్ష్మీ నరసయ్య , అందే కృష్ణమూర్తి,బిట్ల లక్ష్మణ్ బిట్ల రామ్మూర్తి,బిట్ల వేణు,నల్ల రాజు , నల్లశంకర్,చిందం వీరస్వామి కొంతం వేణు వీరేశం సుధాకర్ పులిపాటి మధు, రాజా నరేందర్ , కటకం బిక్షపతి, బూర ప్రకాష్, గుల్లపల్లి చంద్రశేఖర్, ఊరుగొండ రాజు పులిపాటి రాజు,పద్మశాలి సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూభారతి రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలి





- రైతులు,భూ యజమానులు తమ భూమి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్: 27(తరంగాలు)**

రైతులు, భూ యజమానులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీ-సర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖానాపురం మండలం రాగంపేట, నర్సంపేట మండలం రామవరం గ్రామాల్లో భూభారతి రీ-సర్వేలో భాగంగా నిర్వహించిన గ్రామ సభల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి కార్యక్రమం ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సుమారు 100 సంవత్సరాల తర్వాత చేపడుతున్న రీ-సర్వేలో భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను పకడ్బందీగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. రీ-సర్వే ప్రక్రియలో భాగంగా భూ యజమానులు, రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. భూ వివరాల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు రీ-సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూముల హద్దులు, రికార్డులను సక్రమంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలు, ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో గొలుసుల సహాయంతో నిర్వహించే సర్వే ప్రక్రియకు భిన్నంగా ప్రస్తుతం ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రీ-సర్వేను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీ-సర్వేపై రైతులకు, గ్రామస్థులకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.



:నర్సంపేట మండలం రామవరం , ఖానాపురం మండలం రాగంపేటలో రేపటి నుంచి రీ-సర్వే:

నర్సంపేట మండలం రామవరం, ఖానాపురం మండలం రాగంపేట గ్రామాల్లో రీ-సర్వే పనులు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రీ-సర్వే సజావుగా జరిగేలా గ్రామస్థులు, రైతులు అధికారులకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

:ఎల్‌నినో ప్రభావంతో నీటి వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి:

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్‌లో తాగునీరు, పశువులకు నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. రైతులు నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, నర్సంపేట, ఖానాపురం తహసీల్దార్లు రవిచంద్ర రెడ్డి, నంగునూరి రమేష్, రాగంపేట సర్పంచ్ ఏ. రాజు, రామవరం సర్పంచ్ అర్జుం అనితతో పాటు రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమ్మకు అక్షరమాల పరీక్ష - ఘనంగా నిర్వహించిన ఉల్లాస్ ఎగ్జామ్స్



**నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్:27(తరంగాలు)**
సెర్ప్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ - నవ భారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా ఖానాపురం మండల కేంద్రంలో అమ్మకు అక్షరమాల పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమానికి సర్పంచ్ దాసరి రమేష్, ఏపీఎం రమాదేవి హాజరు కాగా గ్రామంలోని నిరక్షరాస్యులైన తల్లులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంతో ఉత్సాహంగా పరీక్ష రాశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి రమేష్ మాట్లాడుతూ, మహిళలు తలుచుకుంటే సాధించనిది అంటూ ఏమీ లేదని, దీని ద్వారా మన గ్రామం పూర్తి అక్షరాస్యత గ్రామంగా వెలుగొందుతుందని, దీనికి కారకులు మీరే అవుతారని తెలిపారు. అమ్మలు అక్షరాలు దిద్దడం, చదువుకు వయసుతో సంబంధం లేదని నిరూపించడం చాలా అభినంద నీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమాదేవి, సీసీ పద్మ మహిళా సంఘాల సిఎ లు శ్రీలత, శ్రీదేవి,సునీత, భవాని, హంస రాణి, సంఘ సభ్యులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో భూక్య రవి మృతి

•పూలమాల వేసి నివాళులు అర్పించిన సర్పంచ్ దాసరి రమేష్



**నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్:27(తరంగాలు)**
ఖానాపురం మండల కేంద్రానికి చెందిన భూక్య రవి అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న సర్పంచ్ దాసరి రమేష్ పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం భూక్య రవి మృతదేహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి రమేష్ మాట్లాడుతూ, భూక్య రవి మృతి చెందడం చాలా బాధాకరమని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని అన్నారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబానికి సర్పంచ్ దాసరి రమేష్ ఉప సర్పంచ్ ఉప్పు రాజు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే గ్రామపంచాయతీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్, వార్డు సభ్యులు అజహర్, ఇలపొంగు కొమురమ్మ, భూక్య స్రవంతి, నవీన్ పార్టీ నాయకులు బోడ పూలు నాయక్,నూనెల కుమారస్వామి, కామిశెట్టి సుధీర్, బోడ దేవా, తోటకూర కుమార స్వామి, యాకూబ్ పాషా, తోటకూర సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లా తైక్వాండో క్రీడా పోటీలు

• తైక్వాండో పోటీలలో రాణించి రాష్ట్రస్థాయిలో సీఎం కప్ లో మెడల్స్ సాధించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.



**నల్గొండ సెప్టెంబరు 27,( తరంగాలు)**
ఆదివారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని పాత గ్రామర్ స్కూల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా తైక్వాండో క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.
నల్గొండ ,యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలనుండి సుమారు 200 మంది బాలురు 100 మంది బాలికలు ఈ శిక్షణలో పాల్గొంటుండగా, వీరందరూ వివిధ కేటగిరీలకు సంబంధించి ఉన్నారని జిల్లా క్రీడలు అభివృద్ధి అధికారి అక్బర్ అలీ జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు . అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని క్రీడలలా కాకుండా తైక్వాండో భిన్నమైన, శారీరక ,మానసిక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందని, అందువల్ల క్రీడాకారులు పోటీలను బాగా అభ్యసించి అన్నిస్థాయిలో మెడల్స్ సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయిలో సీఎం కప్ లో కూడా మెడల్స్ సాధించాలని అన్నారు. జారీ చేసినారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ, నల్గొండ.



# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి





• మున్సిపల్ చైర్మెన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్

**నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్:27(తరంగాలు)**
కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘ అధ్యక్షులు కూచన రవీందర్ ఆధ్వర్యంలో నర్సంపేట పద్మశాలి సంఘంలో ఏర్పాటు చేయగా కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్ని ప్రజల కోసం, ముఖ్యంగా వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అంకితం చేసిన మహనీయుడని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారుబడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలన్న బాపూజీ ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన మార్గంలో నడుస్తూ వెనకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు ఆయన సేవలు త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు రుద్ర ఓంప్రకాష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పెండెం భాస్కర్, పట్టణ కోశాధికారి గాజుల రాము, ముఖ్య సలహాదారులు డాక్టర్ జయుడు, మండల శ్రీనివాస్, కోదాటి వీరస్వామి, కోదాటి గోపి, బాల్నె జగన్, తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయాలతో యువత ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి







**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ**

ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 27, ( తరంగాలు ): భగత్ సింగ్ స్ఫూర్తితో యువత నేడు అనేక రకాల ప్రజా సమస్యలపై పోరాటాల్లో ముందుకు రావా లని, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని డివైఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ పిలుపునిచ్చారు. ఇల్లందు పట్టణంలో డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఇల్లందు పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో కాళంగి హరికృష్ణ పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగాలు, సామాజిక మార్పు కోసం ఆయ న కలలుగన్న సమాజం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భగత్ సింగ్ కేవలం స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాకుండా దోపిడీ, అసమాన తలు లేని సమాజం కోసం పోరాడారని పేర్కొన్నారు. నేటి దేశ పరిస్థితుల్లో నిరుద్యోగం, విద్యా అవకాశాల కొరత, పెరుగుతున్న జీవన వ్యయా లు, ఆర్థిక అసమానతలు వంటి సమస్యలపై యువత గళమె త్తాలని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, సహజ వనరులు, ప్రజల శ్రమపై ఆధిపత్యం కోసం జరిగే సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా యువత ఐక్యంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ప్రజల హక్కులు, దేశ సార్వభౌమత్వం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం ప్రజా స్వామ్య పద్ధతుల్లో పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాలు మరియు సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా నిలవాలని అన్నారు. అందరికీ నాణ్యమైన విద్య, అందరికీ ఉద్యోగాలు కల్పించడంతో పాటు యువతకు మెరుగైన భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు బాధ్యత వహించేలా ఉద్యమా లను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. భగత్ సింగ్ చూపిన ధైర్యం, త్యాగం, శాస్త్రీయ ఆలోచనా విధానం, సామాజిక న్యాయం పట్ల ఆయ న నిబద్ధతను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, దోపిడీకి వ్యతిరే కంగా, సామాజిక న్యాయం కోసం యువత ప్రజా ఉద్యమా ల్లో భాగస్వాములు కావడమే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి అని కాళంగి హరికృష్ణ పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ నబీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి కిరణ్, సీఐటీయూ జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ, కేవీపీఎస్ జిల్లా నాయకులు మోహన్ రావు, డివైఎఫ్ఐ ఇల్లందు పట్టణ కార్యదర్శి బబ్లు, డివైఎఫ్ఐ నాయకులు రమేష్, సర్వన్, మహేష్, ఇల్లందు పట్టణ కమిటీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలిపిన సిఐటియూ





**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 27,( తరంగాలు):** బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ ల సాధన కోసం సెప్టెంబర్ 28 నుండి 30 వరకు 3రోజుల సమ్మె కు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సంఘీభావం ప్రకటించింది. అందులో భాగంగా సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ కరపత్రాన్ని ఇల్లందు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,తెలంగాణ గ్రామీణ బ్యాంక్, జిల్లా సహకార బ్యాంక్ లలో సీఐటీయూ నాయకులు బ్యాంకు ఉద్యోగుల కు మద్దతు కరపత్రాల ను పంపిణి చేస్తు అన్ని బ్యాంకులలో తిరిగి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సమ్మె కు మద్దతు కరపత్రాల ను సీఐటీయూ నాయకులు బ్యాంకు ఉద్యోగులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ పాల్గొని మాట్లాడుతూ, వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని పీఎల్ఐ పథకం అమలు లో ఏకపక్ష ధోరణిని వ్యతిరేకిస్తూ 12 వ వేతన ఒప్పందంలోని మిగిలిన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 28నుండి30 వరకు దేశ వ్యాప్తంగా 3రోజుల సమ్మె కు యుఎఫ్బియు నిర్ణయించింది. ఈ సమ్మెకు దేశవ్యాప్తంగా సిఐటియు సంపూర్ణంగా మద్దతు తెలియజేయడంతో పాటు ప్రత్యక్ష కార్యాచరణలో కూడా పాల్గొంటుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ప్రభుత్వ బ్యాంకింగ్ రంగాన్ని శరవేగంగా ప్రైవేటు పరం చేసే ప్రయత్నాలకు తోడు ఉద్యోగ అధికారుల సంఘాలతో చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందాలను తుంగలో తొక్కి ఏకపక్ష నిర్ణయాలను అమలు చేయడంలో కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల పై గత 12 సంవత్సరాలుగా బ్యాంకు ఉద్యోగులు అధికారులు సమ్మెలు పోరాటాలు చేస్తున్న ప్రభుత్వ వైఖరిలో మార్పు లేదన్నారు. ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని 2023లో ఐబీఏ యూఎఫ్బియు ల మధ్య అంగీకారం కుదిరింది, అవగాహన పత్రాలను యూబీఏ కేంద్ర ప్రభుత్వం ఆమోదం కొరకు పంపింది సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడం అన్యాయం అని అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులపై కేంద్ర ప్రభుత్వ దాడులను వ్యతిరేకిద్దాం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ మూడు రోజులు జరుగుతున్న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు ప్రజలందరూ సహకరించాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు,బ్యాంకు ఖాతా దారులు తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 28 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# హిందూ జాగరణకు సూత్రధారి అశోక్ సింఘల్

**జన్మదినం**

**నల్గొండ-- సెప్టెంబర్ 27, (తరంగాలు )**

శ్రీరామ జన్మభూమి ఉద్యమ సమయంలో తన గర్జనతో రామభక్తుల హృదయాలను ఉత్సాహపరిచిన శ్రీ అశోక్ సింఘల్ బ్రహ్మచారి, యోధుడు కూడా.ఆయన తనను తాను ఎప్పుడూ సామాన్య కార్యకర్త గా భావించేవారు. ఈయన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్. ఈయన జన్మదినం. 1926 సెప్టెంబర్ 27న ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జన్మించారు. ఏడుగురు సోదరులు, ఒక సోదరి ఉన్న కుటుంబంలో ఈయన నాలుగో సంతానం. వారి కుటుంబ మూలాలు ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లాలోని బిజౌలి గ్రామానికి చెందినవి. ఈయన తండ్రి శ్రీ మహావీర్‌జీ ప్రభుత్వ ఉన్నతాధికారిగా పనిచేశారు.ఇంటికి సన్యాసులు, పండితులు తరచూ రావడం వల్ల చిన్ననాటి నుంచే అశోక్‌జీలో హిందూ ధర్మం పట్ల ఆసక్తి, ప్రేమ పెరిగాయి. 1942లో ప్రయాగ్‌లో చదువుతున్న సమయంలో ప్రొ. రాజేంద్ర సింగ్ ఈయనను ఆర్ఎస్ఎస్ స్వయంసేవకునిగా తీర్చిదిద్దారు. అశోక్‌జీ తల్లి విద్యావతీజీకి సంఘ ప్రార్థనను వినిపించే వారు. దాంతో ప్రభావితమైన అశోక్‌జీని శాఖకు వెళ్లేందుకు ఇంట్లో అనుమతించారు.1947లో దేశ విభజన సమయంలో, కొందరు రాజకీయ నాయకులు అధికారాన్ని పొందిన ఆనందంలో ఉండగా, దేశభక్తుల హృదయాలు మాత్రం దేశ విభజన బాధతో మండుతున్నాయి. దేశ భవిష్యత్తుపై ఆందోళన చెందిన అశోక్‌జీ, పరిస్థితులను మార్చేందుకు తన జీవితాన్ని సంఘానికి అంకితం చేశారు.చిన్ననాటి నుంచే ఆయనకు శాస్త్రీయ సంగీతంపై ఎంతో ఆసక్తి ఉండేది. సంఘంలోని వందలాది గీతాలకు ఆయన స్వరాలను సమకూర్చారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయం నుంచి లోహశాస్త్ర ఇంజినీరింగ్ పట్టా పొందారు. 1948లో సంఘంపై నిషేధం విధించబడినప్పుడు సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్లారు. జైలు నుంచి విడుదలైన తరువాత చివరి పరీక్షలు రాసి, 1950లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ గా బాధ్యతలు స్వీకరించారు.ప్రచారకుడిగా



గోరఖ్‌పూర్, ప్రయాగ్, సహారన్‌పూర్ ప్రాంతాల్లో పనిచేసి, తరువాత ప్రధానంగా కాన్పూర్‌లో సేవలందించారు. సరసంఘచాలక్ శ్రీ గురూజీతో ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధం ఉండేది. కాన్పూర్‌లో వేద పండితుడు శ్రీ రామచంద్ర తివారీతో పరిచయం ఏర్పడింది. ఈ ఇద్దరి ప్రభావం తన జీవితంపై ఎంతో ఉందని అశోక్‌జీ భావించేవారు.1975 అత్యవసర పరిస్థితి ఎమర్జెన్సీ సమయంలో, ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రజలను సంఘటితం చేయడంలో ఈయన కీలకంగా పనిచేశారు. 1977లో ఢిల్లీ ప్రదేశ్ ప్రస్తుత ఢిల్లీ, హర్యానా ప్రాంత ప్రచారక్‌గా బాధ్యతలు చేపట్టారు.

1981లో డా. కరణ్‌సింగ్ నాయకత్వంలో ఢిల్లీలో విరాట్ హిందూ సమ్మేళనం జరిగింది. దాని వెనుక సంఘం, అశోక్‌జీ యొక్క విస్తృతమైన కృషి ఉంది. అనంతరం ఆయనకు విశ్వ హిందూ పరిషత్ విహెచ్పి బాధ్యతలు అప్పగించ బడ్డాయి.

ఏకాత్మత రథయాత్ర, సంస్కృతి రక్షణ నిధి, రామ-జానకి రథయాత్ర, రామశిలా పూజ, రామజ్యోతి వంటి కార్యక్రమాల ద్వారా విశ్వ హిందూ పరిషత్ దేశవ్యాప్తంగా విస్తృతంగా పరిచయమైంది.

తరువాత పరిషత్ కార్యక్రమాల్లో బజరంగ్ దళ్, పరావర్తన్, గోరక్షణ, గంగా సంరక్షణ, సేవా కార్యక్రమాలు, సంస్కృతం, ఏకల్ విద్యాలయాలు వంటి అనేక కొత్త అంశాలు చేరాయి. శ్రీరామ జన్మభూమి ఉద్యమం దేశ సామాజిక, రాజకీయ పరిణామాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది.

అశోక్‌జీ విహెచ్పి కి 1982--1986 వరకు సంయుక్త మహామంత్రి, 1995 వరకు మహామంత్రి, 2005 వరకు కార్యాధ్యక్షుడు, 2011 వరకు అధ్యక్షుడు, ఆ తరువాత సంరక్షకుడిగా బాధ్యతలు నిర్వహించారు.

వివిధ పంథాలకు చెందిన సంతులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఎంతో కష్టమైన పని. అయితే అశోక్‌జీ వినయం, సమన్వయంతో లక్షలాది మంది సంతులు ఈ ఉద్యమంతో అనుసంధానమయ్యారు. అయోధ్యకు ఆయన వెళ్లకుండా పలుమార్లు ఆంక్షలు విధించినప్పటికీ, అనేక సందర్భాల్లో పరిపాలనను/పోలీసులను తప్పించుకుని అక్కడికి చేరుకునేవారు.

ఆయన సంస్థాగత సామర్థ్యం, నాయకత్వం కారణంగానే 1992 డిసెంబర్ 6న అయోధ్యలోని బాబ్రీ నిర్మాణం కూల్చివేతకు దారితీసిన రామజన్మభూమి ఉద్యమంలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

సంస్థ కార్యక్రమాల విస్తరణ కోసం ఆయన ప్రపంచంలోని అనేక ప్రధాన దేశాల్లో పర్యటించారు. 2015 ఆగస్టు-- సెప్టెంబర్‌లో కూడా ఇంగ్లాండ్, హాలండ్, అమెరికా దేశాల్లో పర్యటించారు.

అశోక్‌జీ తరువాత కొంతకాలం ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడ్డరు. దాని కారణంగా 2015 నవంబర్ 17న ఆయన మరణించారు. ఆయన ప్రతిరోజూ పరిషత్ కార్యాలయంలో జరిగే శాఖకు హాజరవుతుండేవారు. చివరి రోజులలో కూడా ఆయన జ్ఞాపకశక్తి చక్కగా ఉండేది. ఆశావాద దృక్పథంతో ఎల్లప్పుడూ సంస్థ పనిని ముందుకు తీసుకెళ్లాలని చెప్పేవారు.

అశోక్‌జీకి నిజమైన నివాళి అంటే ఆయన జీవితాంతం కోరుకున్న లక్ష్యాలు, ముఖ్యంగా అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణం, నెరవేరడమే అని ఆయనను స్మరించే వారు భావిస్తారు.

# కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక చేయూత

- భూక్య రవి కుటుంబాన్ని పరామర్శించి రూ.35 వేల నగదు అందజేత
- కార్యకర్త పార్థివ దేహానికి శాఖమూరి హరిబాబు నివాళి



**నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్ 27 (తరంగాలు):**
ఖానాపురం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త భూక్య రవి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఖానాపురం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.35,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. రవి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చి, ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ ఆత్మ డివిజన్ చైర్మన్ యడ్ల బిక్షం రెడ్డి, ఖానాపురం పీఏసీఎస్ డైరెక్టర్ దేవినేని వేణుగోపాల్ రావు, ఖానాపురం మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె. ముస్తాఫా, ఖానాపురం గ్రామ వార్డు సభ్యులు శాఖమూరి ముకేశ్, చలిగంటి మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండవ శివ ప్రసాద్ రావు, నాగార్జున రెడ్డి, శాఖమూరి కృష్ణ, శ్యామ రవి, ఎడ్ల మోహన్ రెడ్డి, చుండూరి శ్రీనివాస రావు, పెండ్లి ఆనంద్, శాఖమూరి వెంకటేశ్వర్లు, కిరణ్, లింగయ్య, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి చందా బహుకరణ చేసిన వాకిటి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 27 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ నెలకొల్పిన గణనాధునికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి ఆదివారము 5 వేల రూపాయల చందాను,అదేవిధంగా ఆవుల స్వామి 2 వేల రూపాయల చందాను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఎర్ర సాయి,బుర్ర శ్రీకర్, బత్తిని కర్ణ గౌడ్,గుడిగ మోహన్,వల్లపు ప్రవీణ్, పాక మహేష్,మర్రి నరేష్, వల్లపు శివ,నూకల ఉదేశ్, జినుకల మహేష్, ముత్యాల గణేష్, మహేష్,సతీష్,శివ, మణిదీప్,మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం




**భద్రాద్రి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27,తరంగాలు:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ గుహల వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), డీఆర్‌డీఓ ఎం. విద్యా చందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కారుకొండ రామవరం సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు లక్ష్మీదేవిపల్లి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాధ్యతాయుతమైన పర్యాటకం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సుస్థిర పర్యాటకం ప్రాధాన్యతను వివరించారు. కారుకొండ రామవరం బౌద్ధ గుహలు, అక్కడి బౌద్ధ సాంస్కృతిక నిర్మాణాల చారిత్రక ప్రాధాన్యత, వాటి పరిరక్షణ ఆవశ్యకతపై బౌద్ధిస్ట్ సొసైటీ సభ్యులు అవగాహన కల్పించారు.

**స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు**

ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పర్యావరణహిత జీవన విధానం, బాధ్యతాయుత ప్రవర్తనపై అవగాహన కల్పించేలా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు.పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా ఉంచడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా వివరించారు.



**టూరిజం పోలీసులకు సన్మానం**

పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు భద్రత, మార్గదర్శకత్వం అందిస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి సేవలందిస్తున్న టూరిజం పోలీసులను జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష ఘనంగా సత్కరించారు. వారి అంకితభావాన్ని అభినందించారు.

చారిత్రక, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను పరిరక్షిస్తూ, పరిశుభ్రతను పాటిస్తూ, స్థానిక సమాజ భాగస్వామ్యంతో పర్యాటక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# పొగ తాగడం కన్నా వేపింగ్, హుక్కా ఇంకా ప్రమాదకరం హెచ్చరిస్తున్న వైద్యులు



వేపింగ్, హుక్కా వంటివి సిగరెట్‌తో పోలిస్తే తక్కువ హానికరమైనవిగా చాలామంది భావిస్తుంటారు. సామాజిక కార్యక్రమాలు, స్నేహితుల సమావేశాల్లో ఇవి సాధారణంగా మారిపోవడంతో వాటి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను చాలామంది పెద్దగా పట్టించుకోవడం లేదు. అయితే వీటి ద్వారా శరీరంలోకి వెళ్లే పదార్థాలు, పొగ, రసాయనాలు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, గుండె, నాడీ వ్యవస్థపై వీటి ప్రభావాన్ని విస్మరించకూడదు.

**భారీ లోహాలు శరీరంలోకి**

వేపింగ్, హుక్కా రెండింటి ద్వారా విషపూరిత రసాయనాలు, భారీ లోహాలు, అతి సూక్ష్మ కణాలు ఊపిరితిత్తుల్లోకి చేరుతాయి. ఇవి శ్వాసకోశంలో వాపును కలిగించడంతోపాటు ఊపిరితిత్తుల కణజాలాన్ని దెబ్బతీసే అవకాశం ఉంటుంది. వేపింగ్‌లో రసాయన ద్రావణాలను వేడి చేసి ఆవిరిగా పీల్చుకుంటే, హుక్కాలో పొగాకు కాల్చేందుకు బొగ్గును ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియల వల్ల శరీరంలోకి వివిధ హానికర పదార్థాలు చేరుతాయి. నీరు లేదా ఇతర వడపోత పద్ధతులు నికోటిన్‌ను పూర్తిగా తొలగిస్తాయని భావించడం కూడా అపోహే. ఫలితంగా అధిక మోతాదులో నికోటిన్ శరీరంలోకి చేరి గుండెపై ఒత్తిడిని పెంచడంతోపాటు నాడీ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

**చుట్టూ ఉన్న వారికీ ప్రమాదమే**

వేపింగ్ లేదా హుక్కా ఉపయోగించే వ్యక్తికే కాకుండా వారి చుట్టూ ఉన్నవారికీ ప్రమాదం ఉంటుంది. వీటి నుంచి వెలువడే పొగ, సూక్ష్మ కణాలు, భారీ లోహాలు, విషపూరిత వాయువులు గాలిలో కలిసిపోవడంతో పక్కన ఉన్నవారు కూడా వాటిని పీల్చుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు ఇలాంటి పొగకు గురికాకుండా జాగ్రత్తపడడం అవసరం. అందువల్ల వేపింగ్ అనేది పొగతాగడానికి పూర్తిగా సురక్షితమైన ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలి.

**ప్రమాదాలు సంభవించే అవకాశం**

వేపింగ్ పరికరాల్లో ఉపయోగించే లిథియం-అయాన్ బ్యాటరీల కారణంగా పేలుళ్లు, కాలిన గాయాలు, రసాయన ప్రమాదాలు సంభవించే అవకాశం కూడా ఉంటుంది. మరోవైపు హుక్కాలో మండుతున్న బొగ్గు కారణంగా మంటలు, తీవ్రమైన కాలిన గాయాలు, కార్బన్ మోనాక్సైడ్ విష ప్రభావం వంటి ప్రమాదాలు ఉంటాయి. కాబట్టి వేపింగ్, హుక్కాలను సాధారణమైన లేదా హానికరం కాని అలవాట్లుగా భావించకుండా, వాటి వల్ల కలిగే ఆరోగ్య, భద్రతా ప్రమాదాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

## దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

**కారేపల్లి,తరంగాలు న్యూస్, సెప్టెంబర్ 27:** మాదారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ శాఖ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు తల్లి దశదినకర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కిలారి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని నాయకులు ఆకాంక్షించారు.



# ఈగ మల్లేశంకు "సంకీర్తన"
# జీవిత సాఫల్య పురస్కారం







- ఓరుగల్లు బిడ్డకు రవీంద్రభారతిలో అపూర్వ గౌరవం...కిరీటధారణతో ఘనంగా సన్మానం
- "సంకీర్తన జీవిత సాఫల్య పురస్కారం"తో కళాసేవకు దక్కిన అరుదైన గౌరవం
- "కళాకారులను గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించుకోవడమే"
- ఈగ మల్లేశం కీలక వ్యాఖ్యలు
- కళామతల్లి సేవలో బాధ్యత మరింత పెరిగింది

**హైదరాబాద్, సెప్టెంబర్ 27, తరంగాలు ప్రతినిధి :** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ రవీంద్రభారతి వేదికగా తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, సంకీర్తన కల్చరల్ సొసైటీ, ఎస్.ఎన్. మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తన 14వ, ఎస్.ఎన్. మ్యూజిక్ 22వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళారంగానికి, సమాజానికి ఈగ మల్లేశం అందిస్తున్న విశేష సేవలను నిర్వాహకులు కొనియాడారు. అనంతరం ఆయనను వేదికపై సాంప్రదాయబద్ధంగా శాలువా కప్పి, పూలమాలతో సత్కరించడంతో పాటు ప్రత్యేకంగా కిరీటధారణ చేసి ఘనంగా సన్మానించారు. అనంతరం "సంకీర్తన జీవిత సాఫల్య పురస్కారం" అందజేశారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ "ఓరుగల్లు.. వరంగల్ గడ్డ కళామతల్లికి పుట్టినిల్లు. ఎందరో మహానుభావులు, వీరులు, అద్భుతమైన కళాకారులను అందించిన ఈ నేల మన సంస్కృతికి నిలువుటద్దం" అని అన్నారు. అలాంటి చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతం నుంచి వచ్చిన తనకు రవీంద్రభారతి వేదికపై "సంకీర్తన జీవిత సాఫల్య పురస్కారం"తో పాటు అపూర్వ సత్కారం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఈ గౌరవం కళామతల్లి సేవలో తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, లలిత కళలను పరిరక్షిస్తూ భావితరాలకు అందించేందుకు సంకీర్తన కల్చరల్ సొసైటీ, ఎస్.ఎన్. మ్యూజిక్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

కళాకారులను ప్రోత్సహించడం ద్వారానే సమాజంలో సాంస్కృతిక వైభవం వెల్లివిరుస్తుందని ఆయన అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కళాకారుల సంక్షేమానికి సంక్షేమ మండలి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కళామతల్లి సేవలో నిమగ్నమై పనిచేస్తున్న సంస్థలను ప్రభుత్వం, సమాజం మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. "కళాకారుడు ఆకలితో అలమటించకూడదు.. ఆయన కళ సమాజానికి మార్గదర్శకంగా నిలవాలి" అని ఈగ మల్లేశం ఆకాంక్షించారు. సంకీర్తన కల్చరల్ సొసైటీ, ఎస్.ఎన్. మ్యూజిక్ అకాడమీ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, ఇలాంటి సంస్థలను ప్రభుత్వం, సమాజం, ప్రతి ఒక్కరూ ఆదరించి ప్రోత్సహించినప్పుడే మన సంస్కృతి సజీవంగా ఉంటుందన్నారు. కళాకారులను గౌరవించడం అంటే మన సంస్కృతిని, మన సమాజాన్ని మనమే గౌరవించుకోవడమేనని ఆయన పేర్కొన్నారు.




## తలకు బలమైన దెబ్బ తగిలినా, పక్షవాతం వచ్చినా ప్రతి నిమిషం చాలా విలువైందేందుకంటే



గుండెపోటు వచ్చినప్పుడు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని చాలామంది కుటుంబాలకు తెలుసు. కానీ అకస్మాత్తుగా మాట తడబడటం, చేయి లేదా కాలు బలహీనపడటం, పడిపోయిన తర్వాత స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు మాత్రం చాలామంది వెంటనే స్పందించరు. అలసట, మైగ్రేన్, నీరసం, రక్తంలో చక్కెర తగ్గడం వంటి కారణాలుగా భావించి కొంతసేపు వేచి చూస్తారు. కొందరు ఒకటి కంటే ఎక్కువ ఆసుపత్రులు లేదా వైద్యులను సంప్రదించిన తర్వాతే నిపుణుల వద్దకు వెళ్తారు. అయితే పక్షవాతం, మెదడులో రక్తస్రావం, తలకు తీవ్రమైన గాయం, వెన్నుపాము గాయం, తీవ్రమైన నాడీ సంబంధిత పరిస్థితులతో వచ్చే మూర్ఛ వంటి మెదడు అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం ఎంతో కీలకం. మెదడుకు రక్తప్రసరణ ఆగినా, మెదడులో రక్తస్రావం జరిగినా కణజాలం వెంటనే దెబ్బతినడం ప్రారంభమవుతుంది. అందుకే లక్షణాలను తొందరగా గుర్తించి సరైన ఆసుపత్రికి చేరుకోవడం అత్యంత ముఖ్యం.

**పక్షవాతం వస్తే**

పక్షవాతం వచ్చినప్పుడు మెదడులోని కొంత భాగానికి రక్తప్రసరణ ఆగిపోతుంది, లేదా రక్తనాళం పగిలి మెదడులో రక్తస్రావం జరుగుతుంది. చికిత్స ఆలస్యం అయ్యే కొద్దీ శాశ్వతంగా దెబ్బతినే మెదడు కణజాలం పెరిగే అవకాశం ఉంటుంది. అకస్మాత్తుగా ముఖం ఒక వైపు వాలిపోవడం, ఒక చేయి లేదా కాలు బలహీనపడడం లేదా తిమ్మిరి రావడం, మాట స్పష్టంగా రాకపోవడం, మాటలు అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, ఒక్కసారిగా తీవ్రమైన తలనొప్పి, గందరగోళం లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా ఎప్పుడూ లేని విధంగా ఒక్కసారిగా తీవ్రమైన తలనొప్పి రావడం మెదడులో రక్తస్రావానికి సంకేతం అయ్యే అవకాశం ఉంది. మెదడులో రక్తస్రావం ఉన్నప్పుడు తలనొప్పితోపాటు వాంతులు, మగత, గందరగోళం, మూర్ఛ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. మైగ్రేన్ లేదా ఇతర సాధారణ సమస్యలుగా భావించి ఆలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అవసరమైన సందర్భాల్లో సీటీ స్కాన్ ద్వారా సమస్యను గుర్తించడం కీలకంగా మారుతుంది.

**తలకు గాయం అయితే**

తలకు గాయమైనప్పుడు కూడా బయటకు కనిపించే పరిస్థితిని బట్టి ప్రమాదం తక్కువగా ఉందని భావించకూడదు. ప్రమాదం తర్వాత బాధితుడు మేల్కొని సాధారణంగా మాట్లాడినా, నడిచినా, తాను బాగానే ఉన్నానని చెప్పినా కొన్నిసార్లు కొన్ని గంటల తర్వాత పరిస్థితి తీవ్రమవుతుంది. మెదడు చుట్టూ రక్తం పేరుకుపోవడం వల్ల ఆలస్యంగా స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల తలకు గాయం అయిన తర్వాత నిరంతర తలనొప్పి, వాంతులు, మగత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించడం, వాహనాల్లో సీటు బెల్టు పెట్టుకోవడం, వృద్ధులు, పిల్లలు పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా తీవ్రమైన మెదడు గాయాలను కొంతవరకు నివారించవచ్చు. చిన్న నగరాలు, జిల్లాల్లో అత్యవసర నాడీ వైద్య సేవలు అందుబాటులో లేకపోయినా దూర వైద్య విధానాల ద్వారా సీటీ స్కాన్ చిత్రాలను నిపుణులు పరిశీలించి త్వరగా చికిత్స నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో కృత్రిమ మేధ ఆధారిత చిత్ర విశ్లేషణ కూడా అనుమానిత పక్షవాతం లేదా మెదడు రక్తస్రావాన్ని త్వరగా గుర్తించడంలో వైద్యులకు సహాయపడుతుంది. అయితే ఇది వైద్యుల నిర్ణయానికి ప్రత్యామ్నాయం కాదు.

**ముందస్తు జాగ్రత్తలు ముఖ్యం**

మెదడు అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో అవగాహనతోపాటు ముందస్తు జాగ్రత్తలు కూడా ముఖ్యమే. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచడం, పొగాకు వినియోగాన్ని మానేయడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం వంటి చర్యలు మెదడు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. పక్షవాతం లక్షణాలను గుర్తించేందుకు ప్రతి కుటుంబం ఫాస్ట్ అనే విధానాన్ని గుర్తుంచుకోవాలి. ముఖం ఒక వైపు వాలిందా, చేయి బలహీనంగా ఉందా, మాట తడబడుతోందా అని గమనించి, అలాంటి లక్షణాలు కనిపిస్తే సమయం వృథా చేయకుండా వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి. సరైన సమయంలో చికిత్స అందితే మాట, కదలిక, జ్ఞాపకశక్తి వంటి ముఖ్యమైన సామర్థ్యాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది.

# షుగర్ లెవల్స్ తగ్గేందుకు కఠిన వ్యాయామాలు అవసరం లేదు ఇవి చాలు

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడానికి ప్రతిరోజూ కఠినమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ సమయం వ్యాయామశాలలో గడపకుండా, ఇంట్లోనే సులభంగా చేయగలిగే కొన్ని శారీరక కదలికలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా భోజనం తర్వాత కొద్దిసేపు కదలడం వల్ల కండరాలు చురుకుగా మారి, శరీరం గ్లూకోజ్‌ను శక్తిగా వినియోగించుకోవడానికి సహాయపడుతుంది. దీంతో భోజనం తర్వాత రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంతవరకు నియంత్రించుకోవచ్చు. రక్తంలో చక్కెరను నిర్వహించుకోవడానికి కాలి కండరాలకు సంబంధించిన వ్యాయామాలు, స్క్వాట్స్, నడక వంటి సులభమైన వ్యాయామాలు ఉపయోగపడతాయి.



**కాలి మడమల వ్యాయామం..**

వీటిలో మొదటిది నిల్చొని లేదా కూర్చొని చేసే కాలి మడమల వ్యాయామం. ఇందులో పాదాలను నేలపై ఉంచి, మడమలను పైకి లేపి తిరిగి కిందకు దించాలి. ఈ కదలిక వల్ల కాలి వెనుక భాగంలోని సోలియస్ కండరం పనిచేస్తుంది. ఈ కండరం గ్లూకోజ్‌ను వినియోగించుకోవడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాయామం చాలా సులభంగా ఉండడంతో ఇంట్లో ఉన్నప్పుడు లేదా కూర్చున్న సమయంలో కూడా చేయవచ్చు. క్రమం తప్పకుండా కండరాలను పనిచేయించడం వల్ల భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరుగుదలను కొంతవరకు తగ్గించుకోవడానికి సహాయపడుతుంది.

**ఎయిర్ స్క్వాట్స్..**

రెండోది ఎయిర్ స్క్వాట్స్. వీటిని ఎలాంటి పరికరాలు లేకుండానే చేయవచ్చు. ముందుగా కాళ్లను కొద్దిగా దూరంగా ఉంచి నిలబడాలి. అనంతరం కుర్చీలో కూర్చున్నట్లుగా మోకాళ్లను వంచి శరీరాన్ని కిందకు దించి, తిరిగి పైకి రావాలి. ఈ కదలికలో ముఖ్యంగా తొడలు, కాళ్ల కండరాలు పనిచేస్తాయి. కండరాల కదలిక పెరగడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను వినియోగించుకోవడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా స్క్వాట్స్ దిగువ శరీర కండరాలను బలోపేతం చేయడంలో కూడా ఉపయోగపడతాయి. అందువల్ల వీటిని రోజువారీ వ్యాయామంలో సులభంగా చేర్చుకోవచ్చు.

**వాకింగ్..**

మూడోది భోజనం తర్వాత నడక. ఇందుకోసం ఎక్కువసేపు లేదా వేగంగా నడవాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత కొద్దిసేపు తేలికగా నడిచినా కండరాలు చురుకుగా మారి, శరీరం గ్లూకోజ్‌ను శక్తిగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా భోజనం తర్వాత నడక రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో ఉపయోగపడే జీవనశైలి చర్యల్లో ఒకటిగా ఉంది. కాలి మడమల వ్యాయామం, ఎయిర్ స్క్వాట్స్, భోజనం తర్వాత నడక వంటి సులభమైన కదలికలను రోజువారీ అలవాట్లలో భాగం చేసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిల నిర్వహణకు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు